# మగాడి బుద్ధి

**— చిట్టారెడ్డి సూర్యకుమారి**

పెళ్ళి అయిన రోజునే నాకు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ వచ్చాయి.

నాకు ఉద్యోగం రావడానికి నా భార్య వచ్చిన వేళావిశేషం, ఆమె అదృష్టం అని అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఆ ఉద్యోగానికి 500 మంది అప్లై చేశారు. ఇంటర్‌వ్యూలో నెగ్గిన ఐదుమందిలో నేనొక్కడ్ని. ఆ ఉద్యోగం వస్తుందన్న నమ్మకంతోనే పెళ్ళి చేసుకున్నాను.

కాంతం తెచ్చిన అదృష్టం ముందు నా డిగ్రీ తెలివితేటలు అన్నీ దిగదుడుపేనా? అనుకుంటూ కాంతంవైపు చూశాను.

'చూశారా! నా అదృష్టం' అన్నట్లు కాంతం సత్యభామలా చూస్తుంటే వళ్ళు మండినా, ఆ చూపులకి ఐస్‌లా కరిగిపోయాను.

శాస్త్రోక్తంగా జరగవలసిన శుభకార్యాలన్నీ జరిగిన తర్వాత హనీమూన్‌కి ఎక్కడెక్కడికి వెళ్ళాలో ప్రోగ్రాం వేసుకుంటూ "ముందుగా తిరుపతి వెంకన్నని సందర్శించి తలనీలాలను అర్పించాలి" అన్నాను.

"ఎప్పుడు మొక్కుకున్నారండీ" అని చొక్కాగుండీ సవరిస్తూ మురిపెంగా అంది కాంతం.

తాళి కట్టించుకుని రెండు రోజులు కూడా కాలేదు. అప్పుడే గుండెను ఆక్రమించుకుని గుండీతో ఆడుతుంది.

'ఈ ప్రకారం లెక్కవేస్తే తలమీద కెక్కడానికి ఎన్నో రోజులు పట్టదు' అని అనుకుంటూ ఉంటే

"ఏమండీ! ఎన్నెన్నో ప్రదేశాలు చూద్దాం అని అనుకుంటున్నాం కదా! మరి అందమైన ప్రదేశాలన్నీ చూడడానికి గుండేసుకుని వెళ్తే ఏం బాగుంటుంది" అంది బుంగమూతి పెట్టి అదోలా చూసింది.

ఆ చూపులకి కరిగిపోయాను.

"సరే. తిరిగి వచ్చేటప్పుడు వెళ్దాం" అన్నాను బుగ్గమీద చిటికె వేసి

హనీమూన్ నుంచి తిరిగివస్తూ అనుకున్న ప్రకారం తిరుపతికి ప్రయాణం అవుతుంటే

"అండీ? మిమ్మల్ని నా ఫ్రెండ్స్‌కు చూపాలి. గుండును చూస్తే నవ్వుతారండీ" అంది. నా జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి సవరిస్తూ.

అది నా జుట్టుతో ఆడుకుంటుంటే థ్రిల్లింగ్‌గా ఉంది. కాని గంగలా తలమీద కెక్కిందా! అన్న పిసరంత అనుమానం వచ్చి కళ్ళెత్తి చూశాను.

కాంతం కళ్ళల్లో ఏముందోకాని ఐస్‌కాదు, ఆవిరిలా అయిపోతాను.

ఆ కళ్ళల్లో అంత ఆకర్షణ, ఆమెలో మరింత ప్రేమ అంతా స్త్రీ మాయ. ఆ మాయలో మాయం కావలసిందే.

* * *

నాకు పెళ్ళయి మూడేళ్ళయినా ఆ మొక్కుబడి అలాగే ఉండిపోయింది.

మా వంటిదానికి వెంట్రుకలు తీయించేదాకా నా 'మొక్కు'ను పోస్టుపోన్ చేయిస్తూ వచ్చింది కాంతం.

నాకు ప్రమోషన్ వచ్చింది.

అది రావడానికి మా వంటి అదృష్టం అన్నారు. కూతురు పుట్టింది. లక్ష్మి నీకు ప్రమోషన్ వెంటబెట్టుకు వచ్చింది' అన్నారు.

కాంతంమీద కోపం ముంచుకువచ్చింది. వారి వైపు చూశాను.

బిడ్డకు చన్ను ఇస్తూ నా వైపు చూసిన చూపుకు ధూపంలా అయిపోయాను.

మా చిన్నదానికి ఆరోనెల వచ్చాక వెంకటాద్రి నెక్కి వెంకన్న దగ్గరకు ప్రయాణమయ్యాం.

రైల్లో మా సీటు, బర్త్‌లు ఖరారు చేసుకుని సీట్లో సర్దుకున్నాం.

మాకెదురుగా ఓ జంట ఉంది. చూడగానే తెలిసిపోయింది కొత్త దంపతులని.

ఆ కొత్త పెళ్ళికూతుర్ని చూస్తుంటే 'పెళ్ళిరోజు' కాంతం గుర్తుకువచ్చింది. అప్రయత్నంగా మా కాంతాన్ని చూశాను. కాంతం చంటిదాన్ని చాటు చేసుకుని నన్ను చూస్తూ గట్టిగా కూతుర్ని ముద్దు పెట్టుకుంది.

మా కళ్ళేకాదు. కంపార్టుమెంటులో ఉన్న వాళ్ళ కళ్ళన్నీ ఆ కొత్త జంట మీద ఉన్నాయి.

చూడముచ్చటగా ఉన్న ఆ జంటలో 'అతను' ఎక్కువగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు.

పెళ్ళాంకి ఎక్కడ ఏం నొప్పి తగులుతుందో అన్నంత అపురూపంగా కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు.

ఆమె పెళ్ళి వేడుకల్లో అలసిపోయిందేమో కళ్ళు మూతలు పడుతున్నాయి. వెనక్కివాలిన ఆమె తలను భుజం పైకి చేర్చుకున్నాడు.

వెంకటాద్రి ఊపేస్తుంది. వేగానికి ప్రయాణికులు ఊగిపోతున్నారు.

ఆమె భుజంపై నుంచి జారిజారి పోతుంటే ప్రక్కకి జరిగి ఆమెకు నిద్రాభంగం కలుగకుండా మెత్తగా ఒడిలోకి చేర్చుకున్నాడు. తలక్రింద టవలు ఉంచాడు. ఆమె బరువుగా కళ్ళువిప్పింది. అతను కళ్ళు మూసి జో కొట్టాడు.

పెళ్ళాంకి జో కొట్టుతున్న అతన్ని చూసిన వాళ్ళందరూ ముసిముసిగా నవ్వుకున్నారు.

ఏదో స్టేషన్‌లో రైలు ఆగింది. ఆమె ముంగురులు సవరిస్తూ ముందుకు వంగి—

"కాఫీ, తాగుతావా?" అన్నాడు.

"ఊహూ"

"కూల్‌డ్రింక్ అయినా తాగు, నోరు ఎండిపోయినట్లుంది" అంటూ పరుగున వెళ్ళి, పరుగున వచ్చి గ్లాసులో పోసిన చల్లని పానీయం పెదాలకు అందించాడు.

భోజనం టైంకి చిన్నపిల్లకి కొసరి కొసరి మురిపిస్తూ తినిపించినట్లుగా అన్నం పెట్టాడు.


క్రింద బర్త్ ఆయనని బతిమాలి ఆ బర్త్‌పై పడకవేసి దిండు సర్ది, రాత్రి మంచినీళ్ళు అవసరమైతే చేతికి అందుబాటులో నీళ్ళబాటిల్ ఉంచాడు.

కిటికీ అద్దం దింపి, దుప్పటికప్పి కాళ్ళవైపు కూర్చున్నాడు.

ముద్దులభార్య విశ్రమించాక అతనికి తీరిక దొరికినట్లు విశ్రాంతిగా నలువైపుల దృష్టి సారించాడు.

భార్యను ప్రేమగా, అపురూపంగా చూసుకుంటూ ఆ

**ముద్దుల భార్య విశ్రమించాక అతనికి తీరిక దొరికినట్లు విశ్రాంతిగా నలువైపు దృష్టి సారించాడు. భార్యను ప్రేమగా, అపురూపంగా చూసుకుంటూ ఆ ప్రేమను చూస్తుంటే అక్కడ ఆడవాళ్ళందరికి కుళ్ళుగా ఉంది.**



ప్రేమను బాహాటంగా ప్రదర్శిస్తున్న ఆ భర్తను చూస్తుంటే అక్కడ ఉన్న ఆడవాళ్ళందరికి కుళ్ళుగా ఉంది.

జీవితంలో వాళ్లేదో పోగొట్టుకున్నట్లు ముఖాలు మాడ్చుకుని లోలోన నిట్టూర్పులు వదులుతూ భర్తలపై విసుర్లు విసురుతూ కాస్తకూస్త దానికి పిల్లల వీపులు చీరేస్తూ చిరాకుగా ఉన్నారు.

కాంతం అంతపని చేయకపోయినా చూపులు వాడిగా వేడిగా ఉన్నాయి. ఆ చూపుల్లో చిక్కుకోకుండా తప్పించుకుంటున్నాను.

వంటిదాన్ని నిద్రబుచ్చి కాంతం పడుకున్నాక నేను ఏదో పర్వమన్నట్లుగా కాంతాన్ని స్పర్శించాను.

అప్పుడు కాంతం అధరాలపై సన్నని మొలక నవ్వు



చూసి ఆడవాళ్ళు ఎంత అల్ప సంతోషులో గ్రహించిన నేను ప్లాట్‌ఫాం మీదకు వెళ్ళి ధూమపానం సేవిస్తుండగా ఆ పెట్టెలోకి మరో ఫామిలీ వచ్చింది.

పెద్దాయన టి.సితో కలిసి బర్త్‌లకోసం వెతికాడు. వచ్చిన ఆ నలుగురికి ఒక దగ్గర దొరకలేదు.

అక్కడక్కడా సర్దుకున్నారు.

సుమారు పాతిక సంవత్సరాలున్న వాళ్ళమ్మాయికి కాంతం పడుకున్న పై బెర్త్ కేటాయించారు.

ముద్దుల భార్య పడుకున్నదని గ్రహించాక దుప్పటి పరిచేసి, బర్త్ వాల్చుకుని పైకెక్కాడు.

నేను ఆ పై బెర్త్ చేరుకున్నాను.

చీకటిని చీల్చుకుని పోతున్న రైలు వేగంలో మార్పు రావడంతో కుదుపుకూడా తగ్గింది. సద్దు మణిగింది.

నా కళ్ళు మూతలుపడ్డాయి.

ఒక్క కునుకు తీసి ఉంటాను. ఎందుకో మెలకువ వచ్చింది. చెయ్యి తిమ్మిరెక్కింది.

టైం ఎంతయిందో తెలియలేదు. కాని అందరూ గాఢ నిద్రలో ఉన్నారు.

ఆ ప్రక్క ఈ ప్రక్కల నుంచి గురకలు వినిపిస్తున్నాయి. ఆ గురకలు రైలు ఛుక్ ఛుక్‌లో కలిసిపోయి వింతగా ధ్వనిస్తూ ఉన్నాయి.

నా క్రింద ఏదో అలికిడి, అలికిడేకాదు ఒక చెయ్యి ముందుకు ముందుకు పొడుగ్గా సాగిసాగి ఆ ప్రక్కన ఉన్న అమ్మాయిని తాకాలన్నట్టుగా గాలిలో తటపటాయిస్తూ ముందుకు పోతూంది.

అటు తిరిగి పడుకున్న అమ్మాయి ఆ కబంధ హస్తానికి అందకుండా ఇంకా ఇంకా చెక్కకు అతుక్కుపోయి మరి ముందుకుపోలేక భయంగా బిగుసుకుపోయినట్లు ఉండిపోయింది.

ఊపిరిబిగపట్టాను—నా గుండె కళుక్కుమన్నది ఆ చెయ్యి ఎవ్వరిదో గ్రహించాక.

ఎందరో ఆడవాళ్ళని అసూయకు గురిచేసిన వాడిది. అందగత్తె అయిన కొత్త భార్య అతి సమీపంలో ఉంది. కొత్త అందాలు, కొత్త కొత్త రుచులు చవిచూస్తున్న అతి సుందరమైన కాలంలో ఉన్నవాడు.

అయినా పరాయి ఆడదాన్ని ముట్టుకోవాలని కక్కుర్తి పడుతున్నాడు. వాడి బుద్ధి?? ఛీ? కుక్క బుద్ధి. కాదు కాదు మగబుద్ధి...

ఎందుకో మగవాడినైనా నాకే మనస్పంతా చేదుగా అయింది.

అంతలోనే కొత్త భయం పట్టుకుంది. ఆ పిల్లకి తిక్కరేగి అల్లరి చేస్తే...

ఎందుకైనా మంచిదని, లేచి దిగి వచ్చి కాంత కాళ్ళదగ్గర చోటుచేసుకుని కూర్చున్నాను.

పై వాడి చెయ్యి ఆటకట్టింది. కాని, నాకు ఆ రాత్రి శివరాత్రి.

*